సాక్షి బాపట్ల

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



మహాశివరాత్రి పూజలకు ఏర్పాట్లు

మాచర్ల: పట్టణంలోని పలు శివాలయాల్లో బుధవారం మహాశివరాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. ఆయా దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి

భట్టిప్రోలు(వేమూరు): పెదపులివర్రులోని బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీ స్వామి అమ్మ వార్లు మయూర వాహనంపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కనకదుర్గ ఆలయంలో శివరాత్రి



మంగళగిరి: పాత మంగళగిరి కనక దుర్గ ఆలయంలో బుధవారం శివ రాత్రి మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపింది.

న్యూస్‌రీల్

శివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



చినగంజాం: శివరాత్రి తిరునాళ్లకు సంబంధించి మండల కేంద్రంలోని రెండు దేవాలయాల్లో నిర్వహిస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మంగళవారం పరిశీలించారు. ముందుగా ఆయన సోపిరాల రామకోటేశ్వరాలయాన్ని సందర్శించగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులు ఆయనకు స్వాగతం పలికారు. బాలకోటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు నల్లమోపు రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఎస్పీ ఆలయంలోనికి వెళ్లి భక్తుల సౌకర్యాల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ కమిటీ తిరునాళ్ల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలు, పోలీసు శాఖ ఏర్పాట్లు, భక్తులకు అసౌర్యం కలుగకుండా ఏర్పాటు చేసిన వసతులు గురించి ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఎస్పీ మహమ్మద్ మొయిన్, సీఐ వైవీ రమణయ్య, ఎస్‌ఐ శీలం రమేష్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయొద్దు

బాపట్ల: ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా లే అవుట్లు వేస్తే వాటిని రిజిస్ట్రేషన్ చేయొద్దని టౌన్ అండ్ కంట్రీ ప్లానర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల అర్బన్ డవలప్‌మెంట్ పరిధిలోని వెలిచర్ల గ్రామంలోని సర్వే నెంబరు 58-ఎ, 58-బి, 66-1 పరిధిలోని 10 ఎకరాల పరిధిలోని లే అవుట్లు, భర్తీపూడి గ్రామంలోని సర్వే నెంబరు 65-2లోని 1-98ఎకరాల్లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని ఆర్‌సి నెంబరు 19023(31)58/2024తో ఉత్తర్వులు జారీ చేశారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల భాగంగా సోమావారం రాత్రి శాస్త్రోక్తంగా అమరేశ్వరుని ధ్వజాపటారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తొలుత గ్రామ పురోహితుడు కౌశిక కాశ్యాప అవధాని అగ్ని ప్రతిష్టాపన చేసి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించే ప్రక్రియలో భాగంగా ధ్వజపటాన్ని ఆవిష్కరించి ధ్వజపటారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే మంగళవారం ఉదయం స్వామి వారికి నిత్యహోమం నిర్వహించి బలిహరణా కార్యక్రమాన్ని పూర్తిచేశారు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు...

బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన ఉదయం 4గంటల నుంచి స్వామి వారికి అభిషేకాలు ప్రారంభిస్తామని ఈఓ సునీల్ కుమార్ తెలిపారు. రాత్రి 9గంటలకు లింగోద్భవకాలాన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహిస్తారన్నారు. రాత్రి ఒంటిగంటకు ఎదుర్కోల ఉత్సవం, రెండు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. దైవ దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఆర్టీసీ అదనపు సర్వీసులను నడుపుతోంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు సీసీ కెమెరాలు బిగించారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



- గోవాడలో భారీ ఏర్పాట్లు
- విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు
- ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు
- పటిష్ట పోలీసు బందోబస్తు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం గోవాడలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఇనుప బారికేడ్‌లతో క్యూలైన్లు నిర్మించారు. వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

200 మంది పోలీసులతో బందోబస్తు

మహా శివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేవస్థానం ముందు పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. వివిధ కూడళ్లలో 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్, బాడీ కెమెరాల ద్వారా ఉత్సవాలను పర్యవేక్షించనున్నారు. భక్తులు రక్షణ కోసం 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు బందోబస్తును పర్యవేక్షించనున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తులు వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు


శ్రీ బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. బాపట్ల, రేపల్లె, పొన్నూరు, తెనాలి డిపోల నుంచి 33 బస్సులు నడపనున్నారు. బస్సులను నిలిపేందుకు సమీప పొలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించారు.

తాగు నీటి సౌకర్యం ఏర్పాటు

భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీటి ప్యాకెట్లను సిద్ధం చేశారు.

స్వచ్ఛంద సేవలు

గోవాడకు చెందిన దాతలు కాకతీయ సేవా సమితి పేరుతో 25 మంది భక్తులు తాగునీరు, పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేయనున్నారు. శ్రీ బాల కోటేశ్వరస్వామి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య అన్నదానం సత్రంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పది వేల మందికి అన్నదానం కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. శ్రీ లీలా భవానీ పద్మశాలీయ బహుత్తమ సంఘం అన్న సత్రంలో భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో కూడా అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



శ్రీ బాల కోటేశ్వర స్వామి

వైద్య సేవలు

ఆరోగ్య పరంగా భక్తులు ఇబ్బందులు పడకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వైద్యులతోపాటు సిబ్బంది సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నారు.



భక్తుల రద్దీ నియంత్రణ కోసం ఏర్పాటుచేసిన ఇనుప బారికేడ్‌లు

ఏర్పాట్లు పూర్తి చేశాం

శ్రీ బాల కోటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పార్టీ జెండాలతో రాకూడదని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే వారిపై కేసు నమోదు చేస్తాం.

అశోక్‌కుమార్, ఈవో

అరవపల్లిలో తిరునాళ్లు ప్రారంభం



అరవపల్లిలో ప్రత్యేక పూజందుకుంటున్న బాలకోటేశ్వరస్వామి

రేపల్లె రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయంలో మంగళ వారం తిరునాళ్ల మహోత్సవం ప్రారంభమైంది. తొలిరోజు స్వామివారికి ప్రత్యేక అభిషేక మహోత్సవాలు నిర్వహించటంతో పాటు రజిత ఆభరణాలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆనవాయితీగా తొలిరోజు ఆలయ పరిసర ప్రాంతాలు, గ్రామాలలోని పశువుల యజమానులు ఆలయం చుట్టూ తమ పశువులచే ప్రదక్షిణలు చేయించి తమ పశుసంపద వృద్ధి చెందాలని కోరుకున్నారు. ఆలయ ఆవరణలో గొల్లభామ పేరంటాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుందేరు ఆక్రమణల తొలగింపునకు చర్యలు

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- అధికారులతో సమీక్ష

బాపట్ల: కుందేరు వాగు ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కుందేరు వాగు ఆక్రమణలు తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, డ్రెయినేజీ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుందేరు వాగు జిల్లాలో బాపట్ల, చీరాల, చిన్నగంజాం, వేటపాలెం మండలాలలో ప్రవహిస్తుందన్నారు. ఆయా మండలాల్లోని కుందేరు వాగు సర్వేపై తహసీల్దార్లను ఆరా తీశారు. కుందేలు వాగు బాపట్ల మండలంలో 97.20 ఎకరాలు, చీరాల మండలంలో 267 ఎకరాలు, చినగంజాం మండలంలో 460 ఎకరాలు, వేటపాలెంలో 650 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. వాగుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాగుకు ఇరువైపులా ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలు వేసిన వారితో మాట్లాడి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాగుపై కట్టడాలు ఉంటే వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాగులో ఉన్న చెట్ల వేలంపై సంబంధిత డ్రెయినేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను ఆరా తీశారు. చెట్ల వేలం త్వరితగతిన పూర్తిచేసి వాటిని తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. వేలం ద్వారా వచ్చిన నిధులను కాలువ మరమ్మతులకు ఖర్చు చేయాలని సూచించారు. సమావేశంలో బాపట్ల డీఆర్వో గ్లోరియా, డ్రెయినేజీ శాఖ ఇంజినీర్ మురళీకృష్ణ, బాపట్ల తహసీల్దార్ సలీమా, చీరాల తహసీల్దార్ గోపికృష్ణ, చిన్నగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, వేటపాలెం తహసీల్దార్ శివపార్వతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

జల వనరులను భద్రపర్చుకోవాలి

వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు జలవనరులను భద్రంగా నిల్వ చేసుకోవాలని కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. జల వనరుల సంరక్షణ, సరఫరాపై సంబంధిత శాఖలు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని తాగునీటి చెరువులన్నింటిని నూరు శాతం నింపాలన్నారు. ప్రస్తుతం విడుదలయ్యే తాగు, సాగు నీటిని చెరువులలో భద్రపరుచుకోవాలన్నారు. నీటి విడుదల గడువు మార్చి 15వ తేదీతో ముగియనుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు, కృష్ణా పశ్చిమ డెల్టా, ఎన్నెస్పీ, ఇంజినీరింగ్ అధికారులు, కమిషనర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

మీ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని నిలపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేషన్ నియోజకవర్గం శాసనమండలి ఎన్నికలపై మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఏర్పాట్లను ఆయన వివరించారు. బాపట్ల జిల్లాలో ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 12 ప్రాంతాలలో 34 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో 24,493 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముక్తిని ప్రసాదించే ముక్తేశ్వరుడు

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వరస్వామి ఆలయాన్ని సర్వం సిద్ధం చేశారు. కృష్ణానది తీరంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన ముక్తేశ్వరుని కొలిస్తే ముక్తిని ప్రసాదిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో మహాశివరాత్రి పర్వదినాన్ని కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించి స్వామివారిని కొలుస్తారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన మోర్తోట గ్రామంలో శివరాత్రి వేడుకలను తిలకించేందుకు సమీపంలోని కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఆలయంలో వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజాము 3 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు జగాజ్యోతి, రాత్రి 7.30గంటలకు స్వామివారి కల్యాణం, గురువారం స్వామివారి తిరునాళ్ల, గ్రామోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



మోర్తోట ముక్తేశ్వరస్వామి



మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి దేవాలయం

సీఆర్‌జెడ్ ఉల్లంఘనలపై కోర్టులను ఆశ్రయిస్తాం

రాష్ట్ర మానవ హక్కుల వేదిక

చీరాల: నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ ఉల్లంఘనలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల వేదిక పేర్కొంది. మంగళవారం మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, జి.రోహిత్, రాష్ట్ర చేనేత జన సమాఖ్య ప్రతినిధి గుంటూరు మల్లికార్జున్, ఓరుగంటి రెడ్డి రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధి మేడిబోయిన వెంకటరెడ్డి తదితరుల బృందం వేటపాలెం మండలంలోని పొట్టిసుబ్బయ్యపాలెం, కటారిపాలెం, రామాపురం, చీరాల మండలం వాడరేవు గ్రామాల్లో సముద్ర తీరంలోని బీచ్‌రోడ్డు వెంబడి ఉన్న రిసార్ట్స్, హోటల్స్, హేచరీస్, వ్యాపార సంస్థలను పరిశీలించారు. సముద్రతీర ప్రాంతంలో జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఇటీవల మీడియాలో వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలో పర్యావరణ సమస్యలపై పనిచేస్తున్న వేదిక చీరాల ప్రాంతాన్ని పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. సీఆర్‌జెడ్ నిబంధనలను అతిక్రమించి జిల్లా యంత్రాంగం బీచ్ రోడ్డు చేపట్టడం ద్వారా చట్టాలకు తూట్లు పడుతున్నాయన్నారు. బీచ్‌రోడ్ నిర్మాణం చేసిన రిసార్ట్స్ యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ చట్టాలను ఉల్లఘించి సముద్ర తీరం షెల్టర్ బెడ్ అయిన చదును చేసి లేట్ నైట్ పార్టీలకు, విందు వినోదాలకు వినియోగిస్తుంటే అధికార యంత్రాంగం చూస్తుండిపోతుందన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఏకంగా రిసార్ట్స్ ప్రయోజనాల కోసం సముద్ర తీరంలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం విద్యుత్‌శాఖ బాధ్యతా రాహిత్యాన్ని స్పష్టం చేస్తుందన్నారు. వేదిక బృందం వాడరేవులోని మత్స్యకార మహిళలతో చర్చించి మత్స్యకార గ్రామాల సమస్యలను విచారించారు.



సముద్రతీర ప్రాంతంలో పర్యటిస్తున్న రాష్ట్ర మానవ హక్కుల వేదిక బృందం

క్లుప్తంగా

యాంటీ కరప్షన్ వింగ్ అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్



బల్లికురవ: జిల్లా యాంటీ కరప్షన్ వింగ్ అధ్యక్షుడిగా డీ.ఉదయ్‌కుమార్‌ను ఎంపికతో మంగళవారం నియామకపత్రం అందుకున్నారు. బల్లికురవ మండలం వీ.కొప్పరపాడు గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ రెండు దశాబ్దాలకు పైగా ఎమ్మార్పీఎస్, సీఐటీయూ, బహుజన రాష్ట్ర సమితిలో చురుకుగా పనిచేస్తూ సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర యాంటీ కరప్షన్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ప్రకాశం జిల్లా గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు రంగసాయిరెడ్డి, సుబ్రమణ్యం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలు అందిస్తానని చెప్పారు. అధికారులు, ప్రజలకు మధ్య వారధిగా పారదర్శక పాలనకు కృషిచేస్తానన్నారు.

కాలుజారి కాలవలో పడి మేస్త్రి మృతి

ముక్తేశ్వరంలో విషాదఛాయలు



చనిపోయిన అయ్యప్ప (ఫైల్)

బల్లికురవ: బతుదెరువుకు బేల్దారి పనులకు కుటుంబంతో వలస వెళ్లి నీరు తాగేందుకు సాగర్ కాలువలో దిగి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. ఆదివారం ఈ ఘటన జరగగా మంగళవారం 35 కిలోమీటర్ల దూరంలో శవమై తేలాడు. వివరాల్లోని వెళ్తే.. మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన గుంటుపల్లి ఏడుకొండలు, నాగేంద్రం దంపతులకు ఇరువురు కుమారులు. పెద్ద కుమారుడు అయ్యప్ప (28)కు ఐదేళ్ల కిందట మండలంలోని కూకట్లపల్లి గ్రామానికి చెందిన జ్యోతితో వివాహమైంది. అప్పటి నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేటలో నివాసం ఉంటూ బేల్దారి పనులు చేస్తున్నాడు. జ్యోతి అక్కడే నాలుగిళ్లలో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం పల్నాడు జిల్లా అడిగొప్పుల అమ్మవారి సన్నిధిలో జరిగిన వేడుకకు మిత్రుడు శ్రీనుతో కలిసి బైకుపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దుర్గి సమీపంలో దాహం వేయటంతో కాల్వలోకి దిగి నీళ్లు తాగుతుండగా కాలుజారి కాలవలో పడిపోయాడు. ఈత రాకపోవటంతో కిందకు కొట్టుకుపోయాడు. ఈ విషయాన్ని వెంటనే మిత్రుడు శ్రీను కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రెండు రోజులుగా అయ్యప్ప ఆచూకీ కోసం ముక్తేశ్వరం వాసులు రెండు టీమ్‌లుగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం నకరికల్లు–గుత్తికొండ సమీపంలో సాగర్‌కాలువలో అయ్యప్ప భౌతిక కాయం తేలాడుతున్నట్లు గుర్తించారు. మిత్రుడు శ్రీను ఫిర్యాదు మేరకు దుర్గి పోలీసులు కేసు నమోదుతో పోస్టుమార్టం తదుపరి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య జ్యోతి 8 నెలల నిండు గర్భిణి. కుటుంబం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ముగిసిన పోలురాధా ఎడ్ల పోటీలు

- విజేతగా కృష్ణా జిల్లా ఎడ్లు
- విజేతలకు నగదు బహుమతులు పంపిణీ



ఎడ్ల పందెంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

చినగంజాం: మహా శివరాత్రి పురస్కరించుకొని సోపిరాల రామకోటేశ్వరాలయం ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగం నాటుబండి పోలురాధా ఎడ్ల పోటీలు విజయవంతంగా ముగిశాయి. మొదటి బహుమతిని కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామానికి చెందిన తుంగల నాగసింధు, కోకి శ్రీనివాసరెడ్డిల ఎడ్ల జత 3500 మీటర్లు లాగి గెలుపొందింది. రూ.30 వేలు నగదును టీఎస్సార్ ఆంజనేయులు, రెండో బహుమతిని కృష్ణాజిల్లా మోపిదేవికి చెందిన మత్తనాని ఎడ్ల జత 3470.7 మీటర్లు లాగాయి. రూ.25 వేలు నగదును ఆమంచి నరసింహారావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ఆమంచి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు అందించారు. మూడో బహుమతిని కృష్ణాజిల్లా తోట్లవల్లూరు గ్రామానికి చెందిన కళ్లం అనుషారెడ్డి, మనోజ్‌రెడ్డి ఎడ్ల జత 3408.4 మీటర్లు లాగి గెలుపొందగా పోలకం వెంకటరమణ దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారులు నరసింహారావు, శ్రీనివాసరావులు రూ.20 వేలు అందించారు. నాలుగో బహుమతి గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన కామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 3367.10 మీటర్లు లాగి గెలుపొందగా రూ.15 వేలు నగదును పల్లపోలు చంద్రశేఖర్‌రావు అందించారు. ఐదో బహుమతిని బాపట్ల జిల్లా చెరుకుపల్లి గ్రామానికి చెందిన జజ్జర యలమంద, వెంకట గోపాలకృష్ణ ఎడ్ల జత 3256 మీటర్లు లాగి గెలుపొందగా రూ.11 వేలు నగదును ఉలిచి వెంకటరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు అంజినాయుడు, ఆరో బహుమతి బాపట్ల జిల్లా ఆసోదివారిపాలెం గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రమ్మ ఎడ్లజత 3250 మీటర్లు లాగి గెలుపొందగా రూ.7 వేలు నగదును గంటా శ్రీరాములు కుమారులు సునీల్, వెంకటేష్‌లు అందించారు. ఏడో బహుమతిని చినగంజాంలోని సోపిరాల గ్రామానికి చెందిన ముంగల విజయలక్ష్మి ఎడ్ల జత 3180.10 మీటర్లు లాగి గెలుపొందగా రూ.6 వేలు నగదును తుమ్మలపెంట పెద వెంకటస్వామి కుమారులు జయరావు, సుబ్బారావు, పట్టాభిరామయ్యలు అందించారు. ఎనిమిదో బహుమతిని కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన తుమ్మల వెంకట్రావు ఎడ్లజత 2750.6 మీటర్లు లాగి గెలుపొందగా రూ.5 వేలు నగదును ఉలిచి సాంబశివరావు, కోటయ్యలు, తొమ్మిదో బహుమతిని బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన కంకణాల జాలయ్య, మోపిదేవి క్రోసూరివారిపాలేనికి చెందిన కాగితాల శశిధర్ ఎడ్ల జత 2750 మీటర్లు లాగి గెలుపొందగా రూ.3 వేలు నగదును గోగన సాంబశివరావు జ్ఞాపకార్థం వారి కుమారులు నాగరాజు, శివశంకర్ నాయజు, వరప్రసాద్‌లు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో టీఎస్సార్ ఆంజనేయులు, తుమ్మలపెంట సీతారామయ్య, ఆమంచి సుబ్బారావు, పోలకం నరసింహారావు, గంటా సుబ్బారావు, ఆమంచి బ్రహ్మయ్య, తుమ్మలపెంట జయరావు, చెరుకూరి అంకమ్మ, రాయని కృష్ణ, గోగన శివశంకర ప్రసాద్, చెరుకూరి రాంబాబు, ముంగర అప్పారావు, గంట వెంకట నారాయణ, చెరుకూరి భాస్కర్‌రావు, నున్నా హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తయారుచేసే ప్రసాదాలపై ప్రత్యేక దృష్టి

- బాపట్ల జిల్లా ఆహార సంస్థ అధికారి దేవరాజ్
- గోవాడ ఆలయంలో ప్రసాదం పరిశీలన



గోవాడ శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రసాదం పరిశీలిస్తున్న అధికారి

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం దేవస్థానాల్లో తయారు చేసే స్వామి ప్రసాదంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బాపట్ల జిల్లా ఆహార సంస్థ అధికారి దేవరాజ్ తెలిపారు. గోవాడలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో తయారు చేసే ప్రసాదాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రసాదం తయారీలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవస్థానంలో తయారుచేసే లడ్డూలను కూడా పరిశీలించారు. లడ్డూల తయారీకి ఉపయోగించే నూనె శాంపిల్ తీసుకెళ్లారు. దేవస్థానం బయట ఏర్పాటు చేసిన స్వీటు షాపులను తనిఖీ చేసి, ఆహార పదార్థాలను పరిశీలించారు. కలర్ ఆహారం తయారు చేయరాదని హెచ్చరించారు. దేవస్థానంలో తయారుచేసే స్వామి ప్రసాదంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఈఓకు సూచించారు. కార్యక్రమంలో ఆహార పరిశీలన సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్యముల ద్వారా బోధించాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.మోజెస్

కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు కృత్యముల ద్వారా విద్యాబోధన చేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.మోజెస్ చెప్పారు. కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాన్ని మంగళవారం అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.మోజెస్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను బోధనకు వినియోగించుకోవాలని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల ద్వారా అర్థవంతమైన విద్యనందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని చెప్పారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపీనాథ్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు మనోరంజని, విజయశ్రీ, పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్‌ఎం కళాశాలలో ఉద్రిక్తత



ఎస్వీఆర్‌ఎం కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



విద్యార్థుల దాడిలో ధ్వంసమైన కారు

- విద్యార్థుల మధ్య ఘర్షణ
- హాస్టల్ వార్డెన్‌పై దాడి
- ఆగ్రహించిన ఓ వర్గం –కారు ధ్వంసం
- పోలీసుల రాకతో సర్దుమణిగిన వివాదం

నగరం: నగరంలోని ఎస్వీఆర్‌ఎం కళాశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి గొడవ చిలికిచిలికి గాలివానగా మారింది. సుమారు రెండు గంటలపాటు కళాశాలలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలు ఇలా... స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాల హాస్టల్ వద్ద మంగళవారం మధ్యాహ్న సమయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు సర్ది చెప్పి పంపారు. ఒక విద్యార్థి విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వారి బంధువులు కారులో కళాశాల వద్దకు వచ్చి హాస్టల్ వార్డెన్‌పై చేయి చేసుకున్నారు. ఈ విషయం విద్యార్థులకు తెలియడంతో ఆందోళన చేపట్టారు. హాస్టల్ వార్డెన్‌ను కొట్టిన వారిపై విద్యార్థులు దాడి చేయడంతోపాటు వారి కారును కర్రలతో ధ్వంసం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం విద్యార్థులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను అదుపు చేయడం కష్టంగా మారింది. కళాశాల గేటు మూసి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ భార్గవ్ వచ్చి హాస్టల్ వార్డెన్‌పై దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో విద్యార్థులు శాంతించారు.

విద్యార్థులతో అసభ్య ప్రవర్తనపై ఆందోళన

తెనాలిరూరల్: ప్రైవేటు కళాశాల ఫ్లోర్ ఇన్‌చార్జి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించాడంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పట్టణ గంగానమ్మపేటలోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులను కళాశాల ఫ్లోర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ సోమవారం అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులకు చెప్పడంతో మంగళవారం కళాశాలకు వచ్చి అతడిని నిలదీశారు. తాను విద్యార్థులను దూషించలేదని శ్రీకాంత్ వివరణ ఇచ్చాడు. కళాశాలలో అటువంటి ఘటనలకు అవకాశమే లేదని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జ్ఞానజ్యోతిలోని మెళుకువలపై అవగాహన కల్పించాలి

జిల్లా సమగ్ర శిక్ష అధికారి నాగిరెడ్డి



మార్టూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు తాము నేర్చుకున్న మెళుకువలను ప్రయోగాత్మకంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష అధికారి నాగిరెడ్డి అన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఆరు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు వలపర్లలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతర విద్యార్థులుగా తాము నేర్చుకుంటూ విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికి తీయడం ద్వారా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు వస్రం నాయక్, ప్రేమలత, సీఆర్పీలు రమేష్ తిరుపతమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తులసి సీడ్స్ ఆధ్వర్యంలో పోలీసులకు భోజన వసతి



భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు

కొరిటెపాడు(గుంటూరు): మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో సేవా శిబిరానికి విచ్చేసిన 3,000 మంది పోలీస్ సిబ్బంది, 300 మంది స్కాట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మంగళవారం తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, అరుణ దంపతులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ చేసే సేవా కార్యక్రమాలు వారిలో దేశభక్తిని, సేవాతత్పరతను పెంపొందిస్తాయని అన్నారు. దేశాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. గత 14 సంవత్సరాలుగా, భక్తుల సేవ, సహాయ కార్యక్రమాల నిమిత్తం కోటప్పకొండ తిరునాళ్లకు విచ్చేస్తున్న పోలీస్ సిబ్బందికి మూడు రోజుల పాటు భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను ఉద్దేశించి తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరూ గొప్ప గొప్ప లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని పట్టుదలతో వాటిని సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు యోగీష్ చంద్ర మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ రాంబాబు, క్యాంపు ఆఫీసరు టి.శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వి.వి.హరనాథ్, షేక్ దావూద్, ఎస్.అంజి రెడ్డి పాల్గొన్నారు.

యార్డులో 1,26,285 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,19,894 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,26,285 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,478 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య



కలెక్టర్ జె.వెంకట మురళికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

బాపట్ల: కృష్ణా, గుంటూరు శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీలను సీపీఎం, సీఐటీయూ నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, చుండూరు, అమృతలూరు, నిజాంపట్నం, చెరుకుపల్లి, పిట్లవానిపాలెం మండలాల్లో ఎన్నికల అక్రమాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. పై మండలాల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మద్దతుదారులు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మద్దతుదారులను బెదిరింపులకు గురి చేస్తున్నారని వివరించారు. పీడీఎఫ్ అభ్యర్థి తరపున పోలింగ్ ఏజెంట్లుగా ఎవరు ఉండకుండా చేసేందుకు బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించారు. పోలింగ్ రోజున అక్రమాలు జరిగే పరిస్థితి ఉందని విన్నవించుకున్నారు. ఎన్నికలు జరిగే అన్ని మండలాల్లో జరుగుతున్న అక్రమాల విషయమై తగిన చర్యలు తీసుకుని, పోలింగ్ సజావుగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులను కలిసినవారిలో సీఐటీయూ నాయకులు సీహెచ్ మజుందార్, ఎం వసంతరావు ఉన్నారు.

రైల్వే సరుకు రవాణాలో అగ్రస్థానం

డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని సరుకు రవాణాలో రెండో సారి ఈ ఏడాది గడువు తేదీ కంటే ముందే మూడు టన్నుల సరుకు లోడింగ్ సాధించి మరో సారి డివిజన్ తన నైపుణ్యాన్ని సాధించిందని డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే వారం ముందుగానే అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో మార్చి 2వ తేదీ కంటే ముందరే సరుకు రవాణాలో ముందంజలో ఉన్నామని చెప్పారు. రెండు సార్లు ఈ ఘనతను సాధించడం చాలా సంతోషదాయకంగా ఉందని పేర్కొన్నారు. దీన్ని సాధ్యం చేయడంతో బ్రాంచ్ అధికారులు తిరుగులేని మద్దతు, ప్రణాళిక, అంకితభావం, టీమ్ వర్క్‌ల ఫలితమే ఈ విజయానికి కారణం అన్నారు. సీనియర్ డీఓఎం ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీసీఎం సిహెచ్ ప్రదీప్‌కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. గత ఏడాదితో పోలిస్తే డివిజన్ వేగంగా 20 శాతం సరుకు రవాణా సాధించిందన్నారు. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రామ్‌లో 95.91 బ్లాక్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు డివిజన్‌లోని మొత్తం 100 లాంగ్ హాల్స్ ఏర్పడ్డాయన్నారు. ఈ ఏడాదిలో 88.95 శాతం సమయపాలన సాధించిందని వివరించారు. సీనియర్ డీఓఎం దినేష్ కుమార్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా గుంటూరు డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ నేతృత్వంలో ఏ డివిజన్‌లో లేని విధంగా సరుకు రవాణా రెండు సార్లు 3 మిలియన్ల టన్నులు సాధించడం జరిగిందన్నారు. డీఆర్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో గుంటూరు డివిజన్‌లో సరుకు రవాణా గత ఆర్థిక సంవత్సరానికి ముందుగానే విజయం సాధించడం చాలా ఆనందదాయకంగా ఉందని వెల్లడించారు.

ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి లక్ష్మణరావు



మాట్లాడుతున్న పీడీఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం

గుంటూరుఎడ్యుకేషన్: నిజాయతీ, నిబద్ధత కలిగిన కేఎస్ లక్ష్మణరావుకు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాలని పీడీఎఫ్ మాజీ ఫ్లోర్‌లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం జిల్లా కోర్టుతోపాటు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేఎస్ లక్ష్మణరావు 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని, ఎటువంటి అవినీతి మరకలు లేకుండా నిజాయతీగా ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించారని చెప్పారు. శాసనమండలిలో ప్రజా గళం వినిపించడం కోసం పీడీఎఫ్ అభ్యర్థులు అవసరమని, శాసనమండలి ఏర్పడినప్పటి నుంచి పీడీఎఫ్ అటువంటి పాత్ర నిర్వహిస్తోందన్నారు. సోషల్ మీడియాలో వివిధ రకాల తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, నిజాయితీగా ఎదుర్కొనే ధైర్యం లేక ఇటువంటి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈనెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికలను ప్రభుత్వం సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ, టీఆర్ రమేష్, జాషువా, బి.లక్ష్మణరావు, బాషా, రమేష్ పాల్గొన్నారు.

పసుపు ధరలు



దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డులో గరిష్ట ధర రూ.10,800 మంగళవారం పలికినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యార్డుకు 488 బస్తాలు వచ్చాయి. సరుకు కనిష్ట ధర రూ.9,500 గరిష్ట ధర రూ.10,800 మోడల్ ధర రూ.10,800, కాయలు కనిష్ట ధర రూ.9,700, గరిష్ట ధర రూ.10,800, మోడల్ ధర రూ.10,800, మొత్తం 366 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తె మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. అడవితక్కెళ్లపాడులోని రాజీవ్‌గృహకల్పకు చెందిన విజమూరి నాగమణి(45), కుమార్తె శరణ్య(14) రాజీవ్‌గాంధీ కాలనీలోని తమ బంధువులకు పూలను ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. అమరావతి రోడ్డులోని చిల్లీస్ సెంటర్ వద్ద లాడ్జి సెంటర్ నుంచి అమరావతి వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ ఘటన స్థలంలోనే మృతి చెందారు. నాగమణి భర్త పుల్లయ్య 2014లో అనారోగ్యంతో మృతి చెందటంతో టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఆమెకు ఒక కుమారుడు గోపిచంద్, కుమార్తె శరణ్య(14) ఉన్నారు. గోపిచంద్ బీటెక్ పూర్తి చేసి విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శరణ్య స్థానికంగా 9వ తరగతి చదువుతోంది. ఘటనా స్థలాన్ని నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ వంశీధర్, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుని బంధువులకు అప్పగించారు. ఘటనపై మృతురాలి కొడుకు గోపిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు తప్పనిసరి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: ప్రజల గళం శాసనమండలిలో వినపడాలంటే పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మణరావు గెలవటమంటే పట్టభద్రులు గెలిచినట్లేనన్నారు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చేవారు పీడీఎఫ్ అభ్యర్థులు కారని, గెలిచినా, ఓడినా ప్రజా, ఉద్యోగ, కార్మిక, విద్యార్థుల సమస్యలపై పోరాడేవారని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే లక్ష్మణరావును గెలిపించుకుంటే సమస్యల పరిష్కారానికి పోరాడతారన్నారు. నియోజకవర్గంలోని పట్టభద్రులందరూ ఏకతాటిపై ఉండి లక్ష్మణరావును గెలిపించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవటానికి లక్ష్మణరావు గెలుపు అన్నివర్గాల ప్రజలకు అవసరమన్నారు. 27వ తేదిన జరిగే ఎన్నికల్లో బ్యాలెట్‌లో 23వపేరుగా ఉన్న కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు వై.నవీన్, కే.ఆశీర్వాదం, కె.రమేష్, బి.అగస్టీన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చీరాల క్రీడాకారిణికి బంగారు పతకం

కశ్మీర్‌లో జరిగే ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



బంగారు పతకం సాధించిన లక్ష్మికి సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వహకులు

చీరాల రూరల్: ఇంటర్ కాలేజియేట్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాల క్రీడాకారిణి విజయకేతనం ఎగురవేసింది. అన్ని విభాగాల్లో రాణించి బంగారు పతకం కైవసం చేసుకుని మార్చిలో కశ్మీర్‌లో జరిగే ఆల్‌ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. చీరాలకు చెందిన సమరోతు లక్ష్మి గుంటూరు తాడికొండలోని బీఎస్ఎస్‌బీ డిగ్రీ కాలేజీలో ఫస్ట్ ఇయర్ డిగ్రీ చదువుతుంది. ఈనెల 24న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఇంటర్ కాలేజియేట్ పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో లక్ష్మి 63 కేజీల విభాగంలో పాల్గొంది. అన్ని విభాగాల్లో అత్యుత్తమంగా రాణించింది. ఓవరాల్‌గా 400 కిలోల బరువులు అవలీలగా ఎత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. యూనివర్సిటీ పరిధిలోని 30 కాలేజీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని లక్ష్మి సాక్షికి తెలిపింది. పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభతో బంగారు పతకం కైవసం చేసుకున్న లక్ష్మిని మార్చి 17 నుంచి 21 వరకు కశ్మీర్‌లో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ ఎస్. సుబ్రహ్మణ్యం తెలిపారు. పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి పతకం సాధించాలని పలువురు క్రీడాభిమానులు కోరుతూ లక్ష్మికి అభినందనలు తెలియజేస్తున్నారు.